# అతను వెళ్ళిపోయాడు

శారదా వాళ్ళింటోంచి తెల్లవార్లూ దగ్గు విన్పిస్తోనేవుంది. "చుట్టాలు వచ్చారన్న మాటైనా శారద చెప్పలేదే? అయినా అంతలా దగే చుట్టం ఎవరు బాబూ?" — అనుకొంది విమల

కాఫీలవీ అయ్యాక కిటికీలోంచి శారదని పిల్చి అడిగింది కుడాను "మీ ఇంటి కెవ్వైనా వచ్చారా శారదా? తెల్లవార్లూ దగ్గు విన్పిస్తూనే వుంది మాకు."

ఇంకా ఏమో అనబోతుంటే శారద సైగచేసింది మాట్లాడ వద్దని. గబగబా కిటికీ దగ్గర్నుంచి వెళ్ళిపోయింది లోపలికి.

"ఛ! నా మాటలు విన్నాడో ఏమో!" — అనుకొంటూ విమల కూడా వంటింట్లోకి వచ్చేసింది.

మధ్యాహ్నం ఒంటిగంట వేళ వచ్చింది శారద. "ఏమిటలా కేక పెట్టావు? ఆయన వింటే ఏమైనా అనుకుంటాడని నాకు భయం వేసింది" అంది.

"తర్వాత నేను పశ్చాత్తాపడ్డాలే! అసలు సంగతి చెప్పు, ఎవరా దగ్గుల చుట్టం?"- అంది విమల నవ్వుతూ.

శారద మొహంనిండా సానుభూతి అలుముకుంది. "పాపం అతని విషయమంతా వింటే నువ్వంత ఎగతాళిగా మాట్లాడవు విమలా! చాలా జాలివేస్తుంది."

శారద గాంభీర్యానికి కొంచెం కట్టుబడింది విమల — "ఛ! నేను మాత్రం ఏం ఎగతాళిగా అన్నాను చెప్పు?"

"అబ్బే! అందుక్కాదు. నిజంగానే జాలి కలుగుతుంది. ఆయన మా పెద్దమామగారి కొడుకు. అంటే నాకు బావగారౌతాడు. చుట్టరికం అదీ నాకూ తెలీదు సరీగ్గా. ఎప్పుడో మా పెళ్ళికి వచ్చాట్ట. తర్వాత రాకలూ

పోకలూ జరగలేదులే. రాత్రి పదిగంటలవేళ బండి దిగి వెతుక్కొంటూ వచ్చాడాయన. వాళ్ళ తమ్ముడుకూడా పోల్చలేకపోయారు. "నేనురా! గోవిందాన్ని" - అంటూ తెలియజేస్తేగానీ అర్థంకాలేదు. అలాంటి స్థితిలో ఉన్నాడు మనిషి."

"ఏవిఁటీ? ఇంతకీ జబ్బేమిటి?"

"అప్పుడే అనకూడదనుకో. అయినా క్షయేమోనని ఆయనకి అనుమానంట. పెద్దాసుపత్రిలో నిర్ధారణ చేయించుకుని వైద్యం చేయించుకోవాలని చాలా కాలంనుంచీ అనుకుంటున్నాడట - వైద్యం అంటే మాటలా? అందులోనూ అలాంటి జబ్బులికి? - సిరిసంపదలు కలవాళ్ళకి వచ్చినా తట్టుకోగలిగే జబ్బా యిది? - ఈయనేమో రెక్కాడితేగానీ డొక్కాడని మనిషి. చదువూ అదీ లేదు. పుట్టి పెరిగిన పల్లెటూళ్ళో వడ్రంగంపని కాబోలు చేసుకొంటూ ఉంటాడు. ఎలాగో పైసా పరకా కూడబెట్టి ఏళ్లకొద్దీ వైద్యం చేయించుకుంటూనే ఉన్నాడట. ఫలితం లేదు సరిగదా రోజురోజుకీ కృంగదీసేస్తోంది. మాయదారి తెగులు. కొన్ని నెలలనుంచీ బొత్తిగా పనిచెయ్యలేని స్థితిలో దాదాపు మంచం పట్టినట్టే ఉన్నాడు. ఇక ఏదో ఒకటి అవుతుందని అయినవాళ్ళందర్నీ తలో రూపాయీ అడిగి బయల్దేరి వచ్చేశాట్ట. ఆస్పత్రిలో చేర్పించి పుణ్యం కట్టుకోమని ఒక్కేఇదిగా ప్రాధేయపడ్డాడు. అబ్బ! నాకు ఏడుపొచ్చినంత పనయింది."

"అతనికి భార్యా పిల్లలూ లేరూ!"

"పిల్లలు లేరు. భార్య వుంది, ఉండి ఏం ప్రయోజనంలే. లేనట్టే అనుకో. మొగుడు ఆరోగ్యంగా వున్నన్నాళ్లూ పదీ పరకా సంపాదించి నన్నాళ్ళూ ఇంటిపట్టున వుండి కాపురం చేసింది. ఆయన ఖర్మకొద్దీ పాపం జబ్బుల పాలయ్యేసరికి గిల్లికయ్యం పెట్టేసుకుని పుట్టింటికి వెళ్ళి పోయింది. నగా నట్రా తీసుకుపోయింది. ఓ ఏడాదినుంచీ అక్కడే వుంటోందట."

"మరి ఇతనికి తిండీ తిప్పలూ ఎలాగ? జబ్బుమనిషి కూడాను. పోనీ తల్లి వుందా?"

"ఉండటం వుంది. కానీ ఆ తల్లికూడా ఈయన్ని ఆదరించలేదనుకో. ఆవిడకింకా కొడుకులూ, కూతుళ్ళూ ఉన్నారు. వాళ్ళంతా కాస్త

బాగానే బ్రతుకుతున్నారు. వుద్యోగాలవీ చేసుకుంటున్నారు. ఎప్పుడూ ఏ కోడలికో ఏ కూతురికో పురుడు పొయ్యటమో చాకిరీయో వుంటూనే వుంటుంది. ఆనందంగా బ్రతుకుతోన్న కొడుకుల యిళ్ళదగ్గిరా, కూతుళ్ళ యిళ్ళదగ్గిరా నెలలతరబడి అచ్చట్లతోటీ - ముచ్చట్లతోటీ గడిపేస్తుందావిడ. ఎక్కడో మారుమూల పల్లెటూళ్ళోవున్న ఈ కొడుకు అసలావిడకు గుర్తు వస్తాడో రాడో!

చూడు విమలా! కన్నతల్లి ప్రేమ ఘనమైన ప్రేమ అంటారు. బాగా బ్రతికే బిడ్డల్ని చూసి ఆనందించ వచ్చునుకో. బ్రతుకుదెరువు లేని వాళ్ళని మాత్రం అసహ్యించుకోగలదా తల్లి? కానీ - పెళ్ళాం వెళ్ళి పోయిన తర్వాత - ఆరోగ్యం మరీ చెడిపోయిందని వుత్తరాలు రాసినా కూడా తల్లి ఒక్కసారీ రాలేదట. నిజానికి ఆ కొడుకుదగ్గరికి వెళ్ళే పూట గడవటం కూడా ఇబ్బందే. అందుకే ఆవిడ తొంగి చూడలేదనుకుంటాను—

స్త్రీ హృదయంనిండా ప్రేమ పొంగి పొర్లిపోతూ వుంటుందటారు గానీ ఇలాంటి విషయాలు వింటే ఏమనుకోవాలి? ప్రేమ మాట ఎలావున్నా రాక్షసత్వం మాత్రం బాగా వుంటుందని ఒప్పుకోవాలి"

"మరైతే పాపం అతనికి ఇన్నాళ్ళూ ఎలా జరిగింది?" - విమల సానుభూతిగా అడిగింది.

"ఇంకెలా జరుగుతుంది? లేచి పనిచెయ్యగలిగిననాడు ఒక రూపాయి డబ్బులు వస్తాయి. ఓ శేరు బియ్యం కొనుక్కోవటం. నాలుగు పూటలు వండుకుతినటం. లేవలేకపోతే పనీలేదు - తిండీలేదు. దగ్గుతో సతమత మౌతూ ఒక్కడూ ఆ పూరింట్లో పడుకుని వుండటం.

పాపం? ఆరోగ్యం లేక - సంపాదన లేక - ఆప్తులు లేక - ఆద రణ లేక - జీవచ్ఛవంలా ఓ మూల పడివున్న మనిషి తన దౌర్భాగ్యా నికి ఎంత కృంగిపోతాడో ఆలోచించు విమలా! పాపం ఆయన్ని చూడగానే నా కెంత జాలివేసిందనుకున్నావూ?

ఆయన తన గోడంతా చెప్పుకు బాధపడుతుంటే - "వూరుకో అన్నయ్యా! నిన్ను ఆస్పత్రిలో చేర్పించే పూచీ నాది, జరిగిపోయిందంతా తవ్వుకోటం ఎందుకులే" - అంటూ ఓదార్చారు మా ఆయన.

నిజంగా నాకూ అలాగే అన్పించింది. ఏదో మనల్ని నమ్ముకు వచ్చాడు. ఓ దారి చేరిస్తే ఆరోగ్యం బాగుపడితే పది కాలాలపాటు సుఖంగా వుంటాడు. అంతకన్నా మనకేం కావాలి?

రాత్రి అప్పటికప్పుడు స్టౌ వెలిగించి కొంచెం ఉప్మా చేసిపెట్టాను. వేడినీళ్ళు పెడితే స్నానంచేసి — ఆ ఉప్మా ఒక్క ముద్దతిని — పడుకున్నాడు. నిజంగా ఆయనలా నిశ్చింతగా పడుకుంటే నా కెంత గర్వం కలిగిందనుకున్నావూ? అయినా తోడబుట్టినవా ళ్ళున్నారు. తలో వంద రూపాయలూ వేసుకొని వైద్యం చేయిస్తే ఏనాడో బాగుపడిపోయేవా డాయన — తల్లి దగ్గర బంగారంకూడా వుందట. బిడ్డల ఆరోగ్యం కన్నా తల్లి కేంకావాలి చెప్పు?"... అలా చాలా సేపు చెప్పుకుపోయింది శారద.

విమలకికూడా అతని చరిత్ర వింటోన్నకొద్దీ జాలే కలిగింది — "ఏమిటో శారదా! కొన్ని కొన్ని దారుణాలు చూస్తోంటే మతి పోతోన్నట్టే వుంటుంది. మనసుగలవాళ్ళయితే బాధపడటం తప్ప మనమేం చెయ్యగలం చెప్పు? పోనీలే యిప్పటికయినా అతని అదృష్టం బావుండి మీ ఇంటికి వచ్చాడు."

"మనం మాత్రం ఏం చెయ్యగలం? ఆస్పత్రివా ళ్ళేం చెప్తారో, ఏం చేస్తారో! వెళ్తాను. బాబుకూడా నిద్రపోతున్నాడు. లేస్తాడేమో!" మరి కాస్సేపు కూర్చుని శారద వెళ్ళిపోయింది.

శారద హృదయ మార్దవానికి విమల నిజంగా ముగ్ధురాలైంది.

*　　　*　　　*

తర్వాత నాలుగైదు రోజులవరకూ ఇద్దరూ కలుసుకోనే లేదు. నిజానికి వాళ్ళ చరిత్రలో అది చాలా అపూర్వమైన సంగతి. బాధ్యతలూ బరువులూ ఎరగని చిన్న పిల్లల్లా కేరింతాలు కొట్టకపోయినా — కష్టసుఖాలు మంచిచెడ్డలూ మనస్సు విప్పి చెప్పుకుంటూ — పరస్పరం ఓదార్చుకొంటూ చదివిన పుస్తకాలగురించి తర్కించుకుంటూ — అప్పుడప్పుడూ కలిసి సిని మాలు చూస్తూ — ఒక రకమైన స్నేహామృతాన్ని చవిచూస్తోన్న వివేక వంతులు.

8]

అన్నిరోజులు శారదని కలుసుకోకపోతే విమలకి చాలా ఇబ్బందిగా వుంది. కిటికీలోంచి చూస్తూ నించుంటే శారద కన్పించటం కూడా గగనమై పోయింది. దొడ్డీ వంటిల్లూ విడిచి గదిలోకి వస్తోన్నట్టే లేదు. తను వెళ్దామా అంటే యింట్లో పనుల్తో ఏం తీరిక లేకుండావుందో - చుట్టం కూడా వున్నాడాయె: బావుండదని వూరుకొంది.

దగ్గు మాత్రం అప్పుడప్పుడు ఎడతెరిపి లేకుండా విన్పిస్తోనేవుంది.

మధ్యాహ్నంవేళ రేడియో ఆన్‌చేసి ఇష్టంలేని సంగీతం వింటూ పడుకుంది విమల.

శారద కొడుకుని తీసుకువచ్చింది.

"రా, రా. ఏమిటబ్బా! బొత్తిగా నల్లపూసవై పోయావ్? అంత మరుపు వచ్చేశానా నేను?" - అంటూ నిష్ఠూరాలాడుతూ లేచి కూర్చుంది విమల.

"ఏం మరుపో ఏమిటో" - కొడుకుని దించి పాత పత్రికేదో వాడి ముందు పడేసి కుర్చీ లాక్కుని కూర్చుంది శారద. "రోజూ రావాలనే ప్రయత్నం! బొత్తిగా తీరిచావటం లేదనుకో" - అంటూ విసుగ్గా చెంగుతో మొహం చేతులు తుడుచుకుంది. మనిషి చాలా బడలికగా - చికాకుపడి పోతోన్న దానిలా కన్పించింది. ఎంతైనా తనకు మించిన ధర్మం కూడ దనుకో" - అంది.

"ఏమిటి శారదా! ఎవరి సంగతి? అదేమి టలా చికాకు పడిపోతు న్నావు?" —— అంటూ విస్మయంగా అడిగింది విమల.

శారద ఒక్క నిమిషం వూరుకొంది —— "అప్పుడలా చెప్పి ఇప్పు డిలా చెప్తోందేమిటని అనుకుంటావో ఏమో! నువ్వేమనుకున్నా సరే. అలాంటి ప్రమాదకరమైన జబ్బుని తెలిసికూడా ఆ మనిషిని ఇంట్లో పెట్టు కోవటం మాదే తప్పేమోనని ఇప్పుడు నాకు నిజంగా చికాకు పుడుతోంది."

"ఆస్పత్రి మాటేమైంది?"

"నా మొహం అయింది. వాళ్ళు ఒక పట్టాన చేర్చుకు చస్తారా. రెండు రోజులు వరసగా రిక్షాలకి రూపాయి రూపాయి పోసి తీసికెళ్ళారు? కూర్చుని కూర్చుని వచ్చారు. పెద్ద డాక్టరో యెవడో లేడట. ఎక్సరే తయ్యా

టానికి ఫిల్మ్ లేదట. ఓ వారం రోజులు పోయి రమ్మన్నారట. అప్పుడైనా చేర్చుకుంటారో లేదో తెలీదు. మరో వారం ఆగమన్నా మనమేం చెయ్యలేం."

"ఈ లోపు కొన వూపిరి వాళ్ళయితే చచ్చి ఊరుకుంటారు."

"బాగా చెప్పావు. వాళ్ళు పరీక్ష చేసినా ఔట్ పేషెంట్‌గా వుండమంటారో ఏమో తెలీదు. అందాకా కాస్త దగ్గు వుధృతం తగ్గటానికి వేరే డాక్టర్ నడిగి మందు కొనుక్కువచ్చారు. ఆస్పత్రి సంగతి అలా అయింది ప్రస్తుతానికి.

నీతో చెప్పటానికి నాకేం సిగ్గులేదుగానీ — ఈ నాలుగు రోజులకే నేను చాకిరీతో సతమతమై పోతున్నాననుకో.

అసలు మా ఇంటి వాతావరణమే మారి పోయింది. ఏదో వేళ పట్టున పనీ — వేళ పట్టున తిండీ — వేళ పట్టున నిద్రా — హాయిగా ఏదో చదువుకోవటం - రేడియో వినటం- ఎక్కడి వస్తువులక్కడ పొందిగ్గా వుంచు కోవటం - అలా ప్రశాంతంగా సాగుతుండేది కదా?

ఆ రోజులు మళ్ళా ఎప్పుడొస్తాయో నన్నంత భయంగా వుంది. పని మనిషికి రెండు రూపాయ లెక్కువిస్తే అదే చెప్పినట్టు వింటుందికదా అనుకున్నాను. తీరా అతను వుమ్ములు వూసుకున్న డబ్బా కడగమంటే ససేమిరా చెయ్యనంది. ఇంకేం చెయ్యను చెప్పు? పోనీ ఆ పెద్దమనిషి కయినా అంతమాత్రం ఇంగితం తెలియక్కర్లేదూ? రోజుకోసారి ఆ డబ్బా కడిగి తెచ్చుకోకూడదు? తనకేం పట్టనట్టు అలాగే వూరుకున్నాడు ఓ రోజంతా. పిల్లవాడొకడు తిరుగుతున్నాడు కదా ఇంట్లో! ఆ డబ్బా ముట్టుకుంటాడేమోనని చచ్చేంత భయం. చచ్చినట్టు వేడినీళ్ళు మరగ బెట్టి రోజూ డబ్బా నేనే కడుగుతున్నాను.

స్నానం చేసి బాత్‌రూమ్‌లో పంచె పడేసి పోవటం మహారాజులాగా. బట్టనుకూడా నేనే ఉతికి ఆరవేస్తున్నాను. ఆఖరికి మందుకూడా అతను తాగడువిమలా! - "అమ్మాయ్ కొంచెం మందు యిస్తావా?" - అంటాడు. ఎంత పనిలో వున్నా వెళ్ళి మందు యిచ్చి గ్లాసు కడిగి బల్లమీద పెట్టిరావాలి.

ఇల్లంతా ఏమిటో మందుల కంపు, అమృతాంజనం కంపు, అతనికి

మడత మంచం మీద వరండాలో పక్క వేశాను కదా? అస్తమాను గది లోకి వచ్చి కూర్చుంటాడు. పైగా రేడియో వొకటి బరబరా తిప్పుతుంటాడు. సరే! దానికేమొచ్చెలే అనుకున్నా ననుకో.

తిండి విషయం మాత్రం! సరిగ్గా అన్నం వడ్డించే ముందు — "నేనీ పూట అన్నం తిననమ్మా! ఒక్క కాఫీచుక్క తాగి పడుకుంటాను, చాలు" అంటాడు. కాఫీ యిచ్చి ఎలా పడుకో బెడతాను చెప్పు. అప్పటి కప్పుడు రెండు గోధుమ రొట్టెలు చేసి పెట్టాను రెండు మూడు సార్లు. తీరా చెయ్యటమేగానీ అవీ సరిగ్గా తినడు.

తీరా నేను అన్నం ముందు కూర్చుంటే ఒక్క ముద్దకూడా మింగుడు పడదు. ఖంగు ఖంగుమనో బళ్ళు బళ్ళు మనో ఏక దగ్గడం - ఖాండ్రకించి వుమ్మటం — భగవంతుడా! నాకు వాంతి వచ్చేంత పని అవుతుంది. రెండు పూటలనుంచీ అన్నం తినటంలేదంటే నమ్ము.

అసలు అన్నిటికంటే ప్రమాదకరమైన గొడవ యింకోటుంది.

*తను జబ్బు మనిషినని తెలిసి కూడా పసిపిల్లాణ్ని అస్తమానూ దగ్గ* రికి పిలవటం దేనికి చెప్పు? ఒళ్లో కూర్చో బెట్టుకోవటం — ముద్దు పెట్టు కోవటం — మొన్న నేమైందో తెలుసా? తమ్ముడుగారు ప్రేమకొద్దీ ఒక యాపిల్ పండు కొనుక్కొచ్చి అన్నగారికిచ్చారు. అతను జామకాయ కొరికి తింటోన్నట్టే తింటో కూర్చున్నాడు. అంతలోనే ఈ కుర్రవెధవ వీధిలోంచి పరుగెత్తుకు వచ్చాడు వాళ్ళ నాన్న దగ్గిరికి - వాణ్ని దగ్గిరకి పిల్చి యాపిల్ ముక్క కొరికి పెట్టాడు. అసహ్యంతో ఒళ్ళంతా జలదరించిందనుకో. కుర్ర వెధవ తిండి దొరికిందే సందని గబగబా తినేశాడు.

వాళ్ళ నాన్నకూడా అతని చేష్టలకి చాలా బాధపడుతున్నారు. ఛీ! బొత్తిగా పల్లెటూరి మనిషి. ఒక పద్ధతి తెలీదు. పాడు తెలీదు. యెలా మసులుకోవాలో తెలీదు. తన ప్రవర్తనలవల్ల ఇవతలివాళ్ళెంత బాధపడతారో తెలీదు. ఏమో విమలా! ఈ బెడద ఎలా పోతుందో నాకేం అర్థం కావటం లేదు." — నిస్పృహతో నిట్టూరుస్తూ అప్పటికి ఆగింది శారద. కడుపులో వున్న బాధంతా ఎంతెంతటట వెళ్ళ గ్రక్కుకుంటానా అన్న కంగారుతో ఎదట మనిషిని నోరు మెదపనివ్వకుండా చెప్పేసి కాస్త తేలికపడింది —

"పోనీ నువ్వే చెప్పు. ఇలాంటి పరిస్థితుల్లో నేనేం చెయ్యగలను చెప్పు" అంది చివరకు.

నిజంగా విమలకి జాలి వేసింది శారద ఇరకాటానికి. అవతల ఆ మనిషిని తల్చుకున్నా సానుభూతే కలిగింది. అయిన వాళ్ళంతా తిరస్కరించినా కాస్త దయదల్చి చేరనిచ్చింది శారద. ఆఖరికి ఆ ఆలంబన కూడా అతనికి దక్కేలా లేదు."

"మాట్లాడవేం విమలా?"

"అబ్బే! అదే నేనూ ఆలోచిస్తున్నా. అతని పనులన్నీ అతను చేసుకుంటూ కాస్త జాగ్రత్తగా మసలితే మీతో పాటు పూటకో ముద్ద పెట్టచ్చు. అంతేగానీ చాకిరీ కూడా చెయ్యమంటె ఎవరివశం? అయినా కన్నతల్లో — కట్టుకున్న పెళ్లామో — చెయ్యాల్సిన మోటు పనులు పరాయివాళ్ళు ఎలా చెయ్యగలరు? ఇంకా నువ్వు కాబట్టి ఆ మాత్రం ఓర్చుకుంటున్నావు. నాకయితే అలాంటి జాలి కూడా ఉండదు."

"అదేం మాట? అలాంటి పరిస్థితి వస్తే మాత్రం ఏం చెయ్యగలవు? ఇల్లు పెంటలా ఉంచుకుంటావా?"

"పోనీ అతని పనులేవో అతన్నే చేసుకోమని చెప్పరాదూ? మోమాటం ఏమిటి? ఇంటిపట్టుకు చేరనిచ్చారు. అంతేచాలు. పిల్లాణ్ణి దగ్గిరికి పిలవద్దని ఎంగిళ్ళవీ పెట్టద్దనీ చెప్పరాదూ!"

"సరి ఆయనే ఉంటె వి స్తరెందుకన్నట్టే ఉంది. అలాంటి తెగింపే వుంటే ఆదిలోనే జాగ్రత్తపడేదాన్ని.

అయినా ఇప్పటికి కూడా అతని స్థితి చూస్తుంటే నాకు జాలిలేక పోలేదు విమలా! బొత్తిగా అస్థిపంజరంలా ఉన్నాడు. నాలుగ్గజాల దూరం నడవటానికే దడదడలాడి పోతాడు. ఇక బట్టలవీ ఏం ఉతుక్కుంటాడు? పిల్లలు లేరు కదా? అంచేత పిల్లలంటే ఇష్టం కాబోలు. ఇలా ఆలోచిస్తే అతన్నిగురించి ఏమీ అనుకోబుద్ది వెయ్యదు మళ్లా. నేనే రాక్షసంగా ఆలోచిస్తున్నానేమో బాధ కలుగుతుంది. ఏమిటో విమలా! అతన్ని వెళ్ళి పొమ్మని చెప్పలేం. ఉంటే భరించలేం. ఇలావుంది నా స్థితి. ఇరవై నాలుగ్గంటలూ చాకిరీతో సరిపోతూంది. మా వారు కూడా పైకితేలటంలేదు కానీ చాలా

చికాకు పడుతున్నారు. పోనీ పదో — ఇరవయ్యో ఇమ్మంటే ఇవ్వొచ్చు. వెళ్ళిపోతే బావుండును."

"నిజమే నీ పరిస్థితి దుర్భరంగానే వుంది" - అంది విమల. శారదకి కొంచెం తృప్తి కలిగింది."

"సరే! ఇప్పుడు విచారించి మాత్రం ఏం చెయ్యగలవు? సాధ్యమైనంత వరకూ కొంచెం మర్యాదగానే అతనికి చెప్పేస్తూవుండు. పిల్లవాడి విషయంలో మోమాటం ఏమిటి? — ఎలాగో అతన్ని కాస్త ఆస్పత్రిలో చేర్చేస్తే నీ బాధ తప్పుతుందిలే" — అంటూ ఓదార్చింది విమల.

శారద కాసేపు కూర్చుని వెళ్ళి పోయింది.

విమల చాలాసేపు శారద సమస్య గురించి ఆలోచించింది — భర్తకో - బిడ్డకో — అయితే ఆనందంగా చేసుకోవచ్చు గానీ బొత్తిగా పరాయి వ్యక్తికి — కేవలం జాలితో వెధవ చాకిరీ అంతా ఎవరు మాత్రం చెయ్య గలరు?

సాయంత్రం వంటా - స్నానం కానిచ్చి తీరిగ్గా కూర్చుంటే విమలకేం తోచలేదు. "పోనీ ఒక్కసారి వెళితే శారద దగ్గిర పుస్తకాలు తెచ్చుకోవచ్చు" - అనుకుని బయల్దేరింది.

తలుపులు తీసే వున్నాయి.

వరండాలో మడతమంచంమీద కూర్చున్న మనిషిని కుతూహలం కొద్దీ చూసింది. చూస్తోన్నకొద్దీ విమల మొహనిండా ఆశ్చర్యం అలుముకుంది. ఇతను .... గోవిందయ్యే కదూ? అరే! తనకి బాగాతెలిసిన గోవిందయ్యే!

ఆ గోవిందయ్యకూడా విమలని ఎగాదిగా చూసి - పరిచితుల నుంచి దాక్కుంటోన్న భయంతో తల దించేసుకున్నాడు. విమల అక్కడ నిలబడకుండా గబగబా లోపలికి వెళ్ళింది.

"శారదా! ఏం చేస్తున్నావ్?" - అంటూ.

శారద వేపుడు నూకలజావ కాస్తోంది.

"ఎంతసేపైంది వచ్చి? నా పనిలో వున్నాను" - అంది.

"అబ్బే! ఇప్పుడే. నీ దగ్గిరేమైనా పుస్తకాలుంటే తీసుకుని తొంద

రగా వెళ్ళిపోదామని వచ్చాను."

"ఆఁ ఏవో ఉన్నాయి. నిన్నే లైబ్రరీనుంచి కొత్తవి తెచ్చారు. నాకెక్కడ ఖాళీవుంది చదవటానికి? డెస్కులో వున్నాయి. తీసుకో."

"తీసుకుంటాలే" — కొంచెం గొంతు తగ్గించి అడిగింది విమల.

"ఆయనే కదూ మీ బావగారు? పేరేమిటి? మర్చిపోయాను."

"గోవిందయ్య."

"ఊరు పేరు?"

"నాకు సరిగా గుర్తులేదు. ఏలూరుదగ్గిరేదో పల్లెటూరట. అన్నట్టు మీ పుట్టిల్లు అక్కడే కదూ? ఆ ప్రాంతాలన్నీ నీకు తెలుస్తాయను కుంటాను."

"పోనీలే, ఇప్పుడు మనకా వివరాలన్నీ ఎందుకు? మరి నేను పోనా? ఆయన వచ్చే వేళయింది."

శారద లేచి వచ్చి పుస్తకాలిచ్చింది. వీధి గుమ్మంవరకూ సాగనంపింది.

గోవిందయ్య గోడకేసి మొహం పెట్టుకుని పడుకుని ఉన్నాడు. విమల గబగబా ఇంటికి వచ్చేసింది.

* * *

గోవిందయ్య విమలకి బాగా తెలుసు.

విమల అత్తవారింటి కొచ్చే కొత్తలో సుమారు ఏడెనిమిదేళ్ళ క్రిందట - విమలకి కావలసిన చెక్కసామాన్లన్నీ గోవిందయ్యే చేశాడు. తలకట్టు సూర్యకిరణాలు పెట్టి పందిరిమంచం చేశాడు. చక్కని డిజైన్లు వేసి టేబుల్ చేశాడు- పీటలు చేశాడు. అప్పడాలకర్ర సైతం చేశాడు.

అప్పట్లో గోవిందం చాలా అహంకారంగానూ - బలిష్ఠంగానూ కొమ్ములు తిరిగిన ఆంబోతులాగా ఉండేవాడు.

అలాంటి గోవిందాన్ని అంత బక్కచిక్కిపోయి, కళ్ళలో ప్రాణాలు

పెట్టుకుని - అస్థిపంజరంలా - ఉండటం చూస్తే విమలకి చాలా సంతోషం కలిగినట్టయింది.

"దుర్మార్గుడు" అనుకొంది అప్రయత్నంగా. గోవిందం తండ్రి బ్రతికివున్నరోజుల్లో ఉమ్మడిగా ఉండేవారు. గోవిందం ఎంత ఆకతాయిగా తిరిగినా గారంగానే చూసేవాడు. అయినా చీటికీ మాటికీ పొగరు మోత్తనంగా తండ్రిమీద చెయ్యిచేసికొంటూ ఉండేవాడు.

ఓసారి తల్లి దండ్రుల పోట్లాటలో తల్లిని వెనకేసుకొచ్చి తండ్రిని ఎడా పెడా వాయించాడు. ఆ దెబ్బతో ముసిలాడు చచ్చేవరకూ కొడుకుతో మాట్లాడలేదు.

తన పెళ్ళాం విషయంలో మాత్రం ఎంత రాక్షసంగా ప్రవర్తించ లేదు! ఆ మొదటి పెళ్ళాన్ని నానా హింసలూ పెట్టాడు. ఉత్తపుణ్యానికే ఏవో నేరాలు కల్పించుకుని చితకతన్నేవాడు. కిక్కురుమనకుండా సహించిన కొద్దీ పేట్రేగిపోయాడు.

పాపం ఆ ఇల్లాలి కష్టాలు అంతమయ్యే రోజు వచ్చిందో ఏమో! ఏదో జవాబు చెప్పిందని - నీళ్లు పోసుకుంటోన్నవాడే ఒక్క ఉదుటున వెళ్ళి చెంబుపెట్టి పెళ్ళాం కణతమీద గుద్దేడు - కెవ్వుమని అరవబోతే నోరు నొక్కాడు. చేతుల్లో మనిషి చేతుల్లోనే వాలిపోయింది. అయితే మాత్రం భయపడ్డాడా? బాధపడ్డాడా? రాత్రికి రాత్రే శవాన్ని ఊరి చెరువు లోకి తోసేసి ఇంటికి వచ్చి పడుకున్నాడు.

తెల్లారేసరికి గుప్పుమంది. గోవిందం పెళ్ళాం చెర్లోపడిందని. అవునని కొందరు కాదని కొందరు గుసగుసలాడుకున్నారు. అయినా ఎవ్వడూ వాణ్ని మాత్రం మందలించలేదు.

నాలుగొందలో - ఐదొందలో గుమ్మరించి పోలీసుల్ని ఆకట్టుకున్నాడు - సాయంత్రానికి అంతా మామూలైంది.

ఆ సంగతులన్నీ ఊళ్ళోవాళ్ళంతా చెప్పుకుంటుండే పురాణ శ్రవణం లాగే వినేవాళ్ళు విమలా వాళ్లింట్లో.

నెల్లాళ్లు తిరక్కుండానే రెండో పెళ్ళిచేసుకుని కొత్త పెళ్ళాన్ని

ఇంటికి తీసుకొచ్చాడు. అదేం మందు పెట్టిందోగానీ - దాన్ని మాత్రం దేవతలాగే చూసేవాడు. నించోమంటే నించునేవాడు - కూర్చోమంటే కూర్చునేవాడు.

మొదటి పెళ్ళాం గుడ్డలూ - వస్తువులూ రెండోదానికి సమర్పించుకున్నాడు.

గొడ్డులా పనిచేసి బోలెడు బంగారం కొని దాని ఒంటినిండా సింగారించాడు.

అప్పట్లో వాడికి దగ్గూ గిగ్గూ పట్టుకున్న విషయమేమీ విమల విన లేదు. ఆ తర్వాత గోవిందం ఎక్కడున్నాడో - ఎలా వున్నాడో కూడా విమల కేమంతగా తెలీదు.

గోవిందయ్యని గురించే ఆలోచిస్తూ కూర్చుంటే, అతని కిప్పుడింత ఘోరమైన పరిస్థితి ఎందుకు సంభవించిందో మాత్రం అర్థమైంది. కాని రెండో పెళ్లాన్ని బాగానే చూశాడు. సర్వం దానికే అర్పితం చేశాడు. అయినా అదే గోవిందాన్ని దగా చేసింది. తల్లినికూడా తండ్రి చేత చిటికిన వేలు ఆననివ్వకుండాచేసి - కొడుకునంటూ ఉన్నానని బాగానే కాచుకు తిరిగాడు! అయినా ఆ కొడుకునే తల్లి దగ్గర చేరనివ్వకుండా చేసేసింది.

ఏమిటో ఈ మనుష్యుల్ని - వీళ్ళ తత్వాల్ని అర్థం చేసుకోవటం ఎవరి వశం? అన్పించింది విమలకి.

*   *   *

మర్నాడు - చిమ్మచీకటితో హడావిడిగా శారద - "అతను వెళ్ళిపోయాడు విమలా!" అంది.

నిద్రకళ్లతో పొయ్యి అంటిస్తున్న విమలకి అర్థం కాలేదు.

"ఎవరూ?"

"ఇంకెవరు? మా చుట్టంగారు. నేనే ముందు లేస్తాను కదూ? లేచి బయటికి వచ్చేసరికి వరండాలో మంచం ఖాళీ! సంచి లేదు. చెప్పులు లేవు. వీధి తలుపులు దగ్గరిగా వేసివున్నాయి. గబగబా ఆయన్ని లేపి చెప్తే - బట్టలు వేసుకుని స్టేషన్ కేసి వెళ్ళారు. నే నిలా వచ్చాను" కాస్త ఊపిరి తీసుకుంది.

ఎదటివాళ్ళని గాలి పీల్చుకోనిచ్చింది—

"పోనీ మే మిద్దరంకూడా అతన్నేమీ అన్లేదు. కోపమేమైనా వచ్చిందేమో తెలీదు. నిన్న మధ్యాన్నం కూడా ఆస్పత్రి గురించి యిద్దరూ మాట్లాడుకున్నారు. ఇంత హఠాత్తుగా - చెప్పా పెయ్యకుండా ఎందుకు వెళ్ళిపోయాడో తెలీటంలేదు."

విమల మొహంమీద చిన్న నవ్వు నిలిచింది - "నాకు తెలుసు. నే చెప్తాలే!"

"హాస్యంకాదు. పాపం అతని డబ్బుకూడా ఐదురూపాయలు మా దగ్గిరే ఉన్నాయి. అవికూడా వదిలేసుకు వెళ్ళిపోయాడు."

విమల మళ్ళా అంది - "ఇంత చీకట్నే నీతో హాస్యం ఆడ్డానికి నాకేం పనిలేదనుకున్నావా? మీ గోవిందయ్య నాకు బాగా తెలుసు. ఆనక రా! నీకు వివరాలన్నీ చెప్తాను. ఎందుకు వెళ్లిపోయాడో ఆలోచిద్దాం."

శారద నిజంగా తెల్లబోయింది.

(1965 ఆగస్టు 'తెలుగు - వెలుగు' నుంచి)